సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
గురువారం | 16 | నవంబర్ | 2023



అన్నదాన భవనానికి వితరణ


ఆత్రేయపురం: వాడపల్లి వెంకన్న ఆలయం లో నిర్మిస్తున్న అన్నదాన భవన నిర్మాణానికి కొవ్వూరు శ్రీనివాస్‌రెడ్డి, జ్యోతి దంపతులు (విశాఖపట్నం) రూ.50,116 అందించారు.



అన్నదానానికి విరాళం

అన్నవరం: సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి కె.రవిశంకర్(రాజమహేంద్రవరం) రూ.లక్ష విరాళాన్ని ఆలయ చైర్మన్ రోహిత్, ఈఓ అజాద్‌కు బుధవారం అందజేశారు.

డెల్టా కాలువలకు నీరు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి బుధవారం తూర్పు డెల్టాకు 1,600, మధ్య డెల్టాకు 1,400, పశ్చిమ డెల్టాకు 4,000 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. కాటన్ బ్యారేజీ వద్ద 10.90 అడుగులకు నీటి మట్టం చేరింది.

న్యూస్‌రీల్

24లోపు ఉమ్మడి ఖాతా తెరవాలి

అమలాపురం రూరల్: జగనన్న విద్యా దీవెన పథకం నాలుగో విడత లబ్ధి పొందేందుకు ఈ నెల 24వ తేదీలోగా విద్యార్థి, తల్లితో కలిసి బ్యాంక్ జాయింట్ అకౌంట్ ఓపెన్ చేయాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా తెలిపారు. ఈ విద్యాసంవత్సరం 2022–23లో ఫైనలియర్ పూర్తయిన వారు, ఎస్సీ విద్యార్థులు మినహా, మిగిలినవారు తప్పనిసరిగా జాయింట్ అకౌంట్ ఓపెన్ చేయాలని అన్నారు. విద్యార్థి ప్రైమరీ అకౌంట్ హోల్డర్, తల్లి సెకండరీ అకౌంట్ హోల్డర్‌గా ఉండాలని పేర్కొన్నారు. ఒకవేళ తల్లి మరణిస్తే తండ్రి లేదా సంరక్షకుడు సెకండరీ అకౌంట్ హోల్డర్‌గా ఉండాలని సూచించారు. కుటుంబంలో ఒకరికంటే ఎక్కువ మంది విద్యార్థులు ఉంటే అందరూ కలిసి ఒకే బ్యాంకు అకౌంట్ ఓపెన్ చేయవచ్చని సూచించారు. రాష్ట్రంలోని ఏ బ్యాంకులోనైనా జాయింట్ ఖాతా తెరవవచ్చని, ఏటీఎం, నెట్ బ్యాంకింగ్ వంటి సేవలు ఉండకూడదన్నారు. చెక్ బుక్ సౌకర్యం కలిగి ఉండొచ్చన్నారు. జాయింట్ అకౌంట్‌కు ఆధార్ సీడింగ్ అవసరం లేదని తెలిపారు. ఈ నెల 28న జగనన్న విద్యాదీవెన నిధులు ఖాతాలో జమ చేస్తారని కలెక్టర్ తెలిపారు.

పోర్టిఫైడ్ బియ్యంపై అసత్య ప్రచారాలు

అమలాపురం టౌన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు సరఫరా చేస్తున్న పోర్టిఫైడ్ బియ్యంపై ప్రతిపక్షాలు చేస్తున్న అసత్య ప్రచారాలను ప్రజలు నమ్మవద్దని రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యుడు జక్కంపూడి కిరణ్ తెలిపారు. ఆ బియ్యాన్ని ప్లాస్టిక్ బియ్యం అని ప్రతిపక్షాలు సోషల్ మీడియాల ద్వారా చేస్తున్న అసత్య ప్రచారాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు అమలాపురంలో కిరణ్ బుధవారం ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని ఎక్కడా లేనివిధంగా విటమిన్ బి 12, ఐరెన్, జింక్ వంటి ఔషధ గుణాలు ఉన్న బియ్యాన్ని సరఫరా చేస్తోందని గుర్తు చేశారు. ప్రతి 50 కిలోల బియ్యంలో 500 గ్రాములు (అర కేజీ) పోర్టిఫైడ్ బియ్యాన్ని కలుపుతున్నట్టు స్పష్టం చేశారు. ఈ బియ్యాన్ని ఎసరులో వేసిన తర్వాత అన్నంలో కరిగిపోతాయని చెప్పారు. ఇలాంటి ప్రక్రియ వల్ల ప్రజలకు రక్తహీనత వంటి సమస్యలు దూరం అవుతాయని తెలిపారు. మిగతా రాష్ట్రాల్లో కూడా ప్రజలకు పోర్టిఫైడ్ బియ్యాన్ని అందించే ప్రక్రియ అమలు కోసం సన్నాహాలు జరుగుతున్న విషయాన్ని కిరణ్ గుర్తు చేశారు.

పొత్తులపై ప్రజలకు సమాధానం చెప్పాలి

అమలాపురం టౌన్: రాష్ట్రంలో పొత్తుతో ఒక్కటైన తెలుగుదేశం, జనసేన పార్టీలు అదే తెలంగాణలో చెరో పార్టీతో అంటకాగుతూ ప్రజలనే కాదు వారి పార్టీల శ్రేణులను కూడా అయోమయంలో పడేస్తున్నాయని ఏపీ అగ్రి మిషన్ సభ్యుడు జిన్నూరి రామారావు (బాబి) అన్నారు. అమలాపురంలో బాబి స్థానిక మీడియాతో బుధవారం మాట్లాడారు. ఆంధ్ర రాష్ట్రంలో టీడీపీ, జనసేన పొత్తులో ఉన్నాయి. అదే తెలంగాణ రాష్ట్రంలో టీడీపీ కాంగ్రెస్‌కు పరోక్ష మద్దతు ఇస్తుండగా, జనసేన బీజేపీతో పొత్తు పెట్టుకున్న విషయాన్ని గుర్తు చేశారు. ఆ రాష్ట్రంలోని మద్దతు, పొత్తులపై ఆ నాలుగు పార్టీలూ టీడీపీ, జనసేన, బీజేపీ, కాంగ్రెస్ ప్రజలకు వివరణ ఇవ్వాలని బాబి డిమాండ్ చేశారు. పొత్తుల విషయంలో నిర్దిష్టమైన నిర్ణయంతో, సిద్ధాంతంతో ముందుకు వెళ్లాల్సిన పార్టీలు ఆంధ్రలో ఒకలా, తెలంగాణలో మరోలా వ్యవహరించడాన్ని ప్రజలు విమర్శిస్తున్నారని అన్నారు.

పంచతంత్రం.. పొదుపు మంత్రం

- డెల్టాలో రబీకి ఐదు సూత్రాలతో నీటి ఎద్దడికి చెక్
- నేడు జిల్లా సాగునీటి సలహా మండలి సమావేశం
- రబీ లక్ష్యం 1.72 లక్షల ఎకరాలు
- నీటి లభ్యత తక్కువగా ఉన్నా మొత్తం ఆయకట్టుకు నీరు



కూనవరం ప్రధాన మురుగునీటి కాలువపై క్రాస్‌బండ్ (ఫైల్)

సాక్షి అమలాపురం: గోదావరి డెల్టాలో రబీ సాగుకు జిల్లా యంత్రాంగం పంచ విధానాలు అవలంబించనుంది. ఇలా చేయడం వల్ల నీటి ఎద్దడిని అధిగమించడంతోపాటు అధిక దిగుబడులు సాధించవచ్చని అధికారులు చెబుతున్నారు. నీటి వినియోగంలో పొదుపు పాటించడంతోపాటు వృథా జలాలను చేలకు మళ్లించనున్నారు. ఇందుకు సంబంధించిన కార్యాచరణ ప్రణాళికను అధికారులు సిద్ధం చేశారు. అమలాపురం కలెక్టరేట్‌లో గురువారం జరగనున్న సాగునీటి సలహా మండలి సమావేశంలో రబీ పూర్తి ఆయకట్టుకు అనుమతి ఇవ్వడంతోపాటు నీటి ఎద్దడి రాకుండా తీసుకోవాల్సిన చర్యలపై చర్చించనున్నారు.

జిల్లాలో తూర్పు, మధ్య డెల్టాలలో కలిపి 3.20 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. దీనిలో వరి ఆయకట్టు అంచనా 1.90 లక్షల ఎకరాలు. మొత్తం డెల్టాకు అధికారులు నిర్ణయించిన డిసెంబర్ 1 నుంచి మార్చి 31 వరకు 91.35 టీఎంసీలు అవసరం కాగా నీటి లభ్యత 82.49 టీఎంసీలు మాత్రమే ఉంది. 8.86 టీఎంసీల కొరత ఉన్నా రైతులు రబీ దిగుబడులపై భారీగా ఆశలు పెట్టుకున్నందున మొత్తం ఆయకట్టుకు సాగునీరు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. నీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకోవడంపాటు అధిక దిగుబడులు సాధించేందుకు జిల్లా యంత్రాంగం 'పంచ సూత్రాల'ను ప్రతిపాదిస్తోంది ఇలా..

ముందస్తు సాగు

రబీ ముందస్తు సాగు ద్వారా నీటి ఎద్దడిని అధిగమించే అవకాశముంది. ఇరిగేషన్ అధికారుల అంచనా ప్రకారం గోదావరిలో సహజ జలాల లభ్యత ఫిబ్రవరి నెలాఖరు వరకు మాత్రమే ఉంటుంది. తరువాత మొత్తం సీలేరు పవర్ జనరేషన్ నుంచి వచ్చే నీటి మీదనే పూర్తిగా ఆధారపడాల్సి వస్తుంది. అప్పుడు సీలేరు పవర్ జనరేషన్ నుంచి 4,000 క్యూసెక్కులు, బైపాస్ పద్ధతిలో రెండు వేల క్యూసెక్కులు నీరు ఇచ్చినా పంట కాలువలకు పూర్తిస్థాయిలో ఇవ్వలేని పరిస్థితి తలెత్తుతుంది. దీనిని దృష్టిలో పెట్టుకుని డిసెంబర్ 10నాటికి నాట్లు పూర్తి చేయాలని, వెదజల్లు పద్ధతి పాటించాలని వ్యవసాయ, ఇరిగేషన్ అధికారులు కోరుతున్నారు. ఇలా చేస్తే మార్చి నెలాఖరు నాటికి సాధ్యమైనంత వరకు కోతలు మొదలైతే నీటి ఎద్దడి తప్పే అవకాశముంటుంది.

వారాబందీ

గోదావరి డెల్టా కాలువల ద్వారా నీటి సరఫరాను సాధ్యమైనంత త్వరగా వారాబందీ (వంతుల వారీ విధానం) అమలు చేయనున్నారు. గతంలో నీటి లభ్యతను బట్టి సంక్రాంతి తరువాత, ఫిబ్రవరిలో ఈ విధానం అమలు చేసేవారు. కాని ఇప్పుడు అంతకన్నా ముందే ఈ విధానాన్ని ప్రవేశపెట్టడం ద్వారా నీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకోనున్నారు. ఇలా చేయడం ద్వారా సుమారు 5 టీఎంసీల నీటిని ఆదా చేసే అవకాశముందని అధికారులు చెబుతున్నారు.

క్రాస్‌బండ్‌ల ఏర్పాటు

మురుగునీటి కాలువలపై క్రాస్‌బండ్‌లు పెద్ద ఎత్తున వేయనున్నారు. గత రబీ కాలంలో ప్రభుత్వం రూ.3.45 కోట్లు కేటాయించి 189 చోట్ల క్రాస్‌బండ్‌లను నిర్మించింది. ఈసారి కూడా ఇదే విధానం అవలంబించనున్నారు.

మోటార్లతో ఎత్తిపోతలు

మెరక చేలకు పంట కాలువలో నీరు మోటార్లతో తోడడంతోపాటు మురుగునీటి కాలువలో వృథా నీటిని పంట కాలువల ద్వారా చేలకు మళ్లించనున్నారు. ఇందుకు అయ్యే డీజిల్ ఖర్చును గతంలో ప్రభుత్వం ఇచ్చింది. ఈసారి కూడా ఇవ్వాలని అధికారులు ప్రతిపాదిస్తున్నారు. క్రాస్‌బండ్‌లు వేయడం, మోటార్ల ద్వారా నీటి తోడకం వల్ల సుమారు 3.86 టీఎంసీలు సేకరించాలని నిర్ణయించారు.

ఎండు–పండు

'వరి నీటిలో పెరిగే మొక్కే కాని... నీటిలో మాత్రమే పెరిగే మొక్క కాదు'. నాట్లు వేసే సమయంలోనూ... దబ్బులు చేసి పంట చేలు పాలుపోసుకునే సమయంలో మినహా మిగిలిన సమయంలో పొలాల్లో నీరు తక్కువగా ఉంటే అధిక దిగుబడి వస్తుంది. అందుకే 'ఎండు- పండు' అంటారు. రబీకి నీటి ఎద్దడి వచ్చిన సమయంలో రికార్డు స్థాయిలో దిగుబడి వచ్చిన విషయం తెలిసిందే. తాజాగా వర్షాభావ పరిస్థితుల వల్ల ఖరీఫ్‌లో సగటు దిగుబడి 28 బస్తాలు (బస్తా 75 కేజీలు) కాగా డెల్టాలో కొన్నిచోట్ల 48 బస్తాల వరకు దిగుబడి వస్తోంది. ఇదే విధానం అవలంబిస్తే దిగుబడి రావడంతోపాటు నీటి సరఫరాపై ఒత్తిడి తగ్గుతుందని, రబీ గట్టెక్కుతామని అధికారులు చెబుతున్నారు.

ఈ ఐదు సూత్రాల ద్వారా రబీని విజయవంతంగా పండించవచ్చని సాగునీటి పారుదల శాఖ, వ్యవసాయ శాఖ అధికారులు ధీమాగా చెబుతున్నారు. ఇందుకు అనుగుణంగా రైతులకు అవగాహన కలిగించేందుకు త్వరలోనే రైతు భరోసా కేంద్రాలు (ఆర్‌బీకే)ల స్థాయిలో అవగాహన సదస్సులు నిర్వహించనున్నారు. పనిలో పనిగా నీటి వినియోగం తక్కువగా ఉండే ఆరుతడి పంటలైన మొక్కజొన్న, అపరాల సాగును మెరక ప్రాంతాల్లో ప్రత్యామ్నాయంగా ప్రోత్సహించాలని నిర్ణయించనున్నారు. మొత్తం మీద గురువారం జరిగే ఐఏబీ సమావేశంలో మొత్తం ఆయకట్టుకు అనుమతి లాంఛనమే అయినా... ప్రత్యామ్నాయ చర్యలపై సుదీర్ఘంగా చర్చించనున్నారు.

ప్రణాళికాబద్ధంగా ముందుకు..

> జిల్లా రబీ ఆయకట్టుపై ఐఏబీలో ప్రజాప్రతినిధులు, జిల్లాకు చెందిన ఉన్నతాధికారులతో చర్చించి తుది నిర్ణయం తీసుకుంటాం. నీటి లోటును అధిగమించేందుకు వంతుల వారీ విధానం, క్రాస్‌బండ్‌ల ఏర్పాటు చేయడంపై ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళతాం.
> – బుల్లిరాజు, ఇరిగేషన్ శాఖ జిల్లా అధికారి



ముమ్మిడివరం మండలం బొండాయికోడు వద్ద డ్రెయిన్ నుంచి సాగునీటిని పంట కాలువలోకి ఇంజిన్ల ద్వారా మళ్లించడాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ శుక్లా (ఫైల్)

కుల గణన చారిత్రాత్మకం

మంత్రి వేణుగోపాలకృష్ణ



సీఎం జగన్ చిత్రపటానికి మంత్రి వేణు సమక్షంలో క్షీరాభిషేకం చేస్తున్న ప్రజాప్రతినిధులు

రామచంద్రపురం రూరల్: రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమగ్ర కుల గణనకు నాంది పలకడం చారిత్రాత్మక అంశమని రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. సమగ్ర కుల గణన పైలట్ ప్రాజెక్టుగా రామచంద్రపురం నియోజకవర్గం రామచంద్రపురం మండలంలోని నెలపర్తిపాడులో బుధవారం మంత్రి వేణు లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ స్వాతంత్ర్యానికి పూర్వం 92 ఏళ్ల క్రితం కుల గణన జరిగితే మళ్లీ ఇప్పటి వరకు జనాభా గణన తప్ప కుల గణన జరుగలేదన్నారు. నిత్యం నా ఎస్సీలు, నా ఎస్టీలు, నా బీసీలు, నా మైనార్టీలు అంటూ ఆయా వర్గాలను అక్కున చేర్చుకున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వారందరికీ అత్యంత ప్రయోజనకరమైన సమగ్ర కుల గణన చేపట్టడం.. వారి అభ్యున్నతికి తోడ్పడుతుందన్నారు. నెలపర్తిపాడు గ్రామంలో సమగ్ర కుల గణన ప్రారంభించిన కారణంగా చరిత్రలో నిలిచిపోతుందన్నారు. మన రాష్ట్రంలో 145 బీసీ కులాలు, 69 ఎస్సీ, ఎస్టీ కులాలు ఉన్నాయన్నారు. అయితే ఏ కులాల్లో ఎంతమంది జనాభా ఉన్నారన్న నిర్దిష్టమైన లెక్కలు ప్రభుత్వం వద్ద ఉంటే అందరికీ సమన్యాయం చేసే అవకాశం ఉంటుందన్నారు. ప్రజాప్రతినిధులు, నాయకులు ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ రాయుడు సీతామహాలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు మేర్నీడి వెంకటేశ్వరరావు, ఎంపీపీ అంబటి భవాని, వైస్ ఎంపీపీలు నరాల రాజ్యలక్ష్మి, శాకా బాబీ, మండల కోఆప్షన్ సభ్యుడు బాబ్జీ, నియోజకవర్గ శెట్టిబలిజ సంఘం అధ్యక్షుడు నరాల ఏడుకొండలు, ఏపీఐడీసీ డైరెక్టర్ వి.శ్యామ్ పాల్గొన్నారు.

టీడీపీ–జనసేన సమన్వయం తుస్సు

జనసేనలో ఒక వర్గం కస్సుబుస్సు

సాక్షి అమలాపురం: టీడీపీ, జనసేన పార్టీల మధ్య పొత్తులు పొడిచినా... సొంత పార్టీలలో నాయకుల మధ్య కత్తులు దూసుకోవడం ఆపలేదు. ఇటు టీడీపీలో, అటు జనసేనలో ఇన్‌చార్జిలు మీద ఉన్న అసంతృప్తి పలు సందర్భాలలో బహిర్గతమవుతూనే ఉంది. పార్టీ కార్యక్రమాలకు డుమ్మా కొడుతూ ఇన్‌చార్జిల తీరుపై నిరసన వ్యక్తం చేస్తూనే ఉన్నారు.

అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ, జనసేన సమన్వయ కమిటీ సమావేశం అమలాపురం శివారు బోడసకుర్రులోని ఒక ఫంక్షన్ హాల్‌లో బుధవారం జరిగింది. సమావేశానికి ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జిలు అయితాబత్తుల ఆనందరావు, శెట్టిబత్తుల రాజబాబులు నాయకత్వం వహించారు. సమావేశం సాదాసీదాగా సాగిపోయింది. రెండు పార్టీలలో ఎవరికి టిక్కెట్ ఇచ్చినా రెండవ పార్టీ నాయకులు సహకరించాలని నిర్ణయించారు. అధికార పార్టీకి వ్యతిరేకంగా కలిసి ఆందోళన కార్యక్రమాలు చేయాలని నిర్ణయించారు. అయితే ఈ సమావేశానికి జనసేన అమలాపురం పార్లమెంట్ ఇన్‌చార్జి డి.ఎం.ఆర్.శేఖర్ తోపాటు అతని వర్గానికి చెందినవారు దూరంగా ఉండడం గమనార్హం. మాజీ మున్సిపల్ చైర్మన్ యాళ్ల నాగసతీష్, మున్సిపల్ ప్రతిపక్ష నాయకుడు యేడిద శ్రీను, అమలాపురం రూరల్ పార్టీ అధ్యక్షుడు లింగోలు పండు, పార్టీ సీనియర్ నాయకుడు నల్లా శ్రీధర్ తోపాటు, పట్టణ కౌన్సిలర్లు తిక్కా రాణీ ప్రసాద్, పడాల శ్రీదేవి, పార్టీ సీనియర్లుగా ఉన్న అయితాబత్తుల ఉమామహేశ్వరరావు, ఇసుకపట్ల రఘుబాబు వంటి వారు దూరంగా ఉన్నారు. వీరంతా పార్టీ ఇన్‌చార్జి శెట్టిబత్తుల రాజబాబు మీద తీవ్ర అసంతృప్తి ఉన్నా వారే. అవకాశం వచ్చినప్పుడల్లా తమ అసంతృప్తిని తెలియజేస్తుంటారు. ఇక టీడీపీలో సైతం పలువురు పార్టీ నాయకులు ఈ సమావేశానికి దూరంగా ఉన్నారు. పార్టీ ఇన్‌చార్జి ఆనందరావు సొంత మండలం ఉప్పలగుప్తంలో మునిపల్లి, పెదగాడవిల్లి, చినగాడవిల్లి గ్రామానికి చెందిన పార్టీ క్యాడర్ డుమ్మా కొట్టగా, ఇదే మండలంలో టీడీపీ సీనియర్ నాయకుడు, మాజీ హోంమంత్రి నిమ్మకాయల చినరాజప్ప వర్గానికి చెందినవారు సమావేశానికి హాజరు కాలేదు. ఇటీవల పార్టీ అధినేత చంద్రబాబు అరెస్టు అయిన సమయంలో రాజప్ప వర్గానికి చెందినవారు ఆనందరావుతో సంబంధం లేకుండా ఉప్పలగుప్తంలో వేరుగా నిరసన దీక్షలు చేపట్టడం అప్పట్లో చర్చనీయాంశమైంది. టీడీపీకి చెందిన మాజీ మున్సిపల్ చైర్మన్ చిక్కాల గణేష్ సైతం సమావేశానికి హాజరు కాలేదు. ఇలా సొంత పార్టీ నాయకులే బహిరంగంగా ధిక్కార ధోరణి అవలంబిస్తుండడంతో పార్టీ ఇన్‌చార్జిలు ఆనందరావు, రాజబాబులకు మింగుడుపడని అంశంగా మారింది.

రూ.310 కోట్లతో 447 జూనియర్ కళాశాలల అభివృద్ధి



కొత్తపేట జూనియర్ కళాశాల వద్ద అధికారులకు సూచనలు చేస్తున్న సీఈ శ్రీనివాసరావు

కొత్తపేట: రాష్ట్ర వ్యాప్తంగా 447 ప్రభుత్వ జూనియర్ కళాశాలలను రూ.310 కోట్లతో అభివృద్ధి చేస్తున్నట్టు సమగ్ర శిక్ష చీఫ్ ఇంజినీర్ కె.శ్రీనివాసరావు తెలిపారు. నాడు – నేడు పథకం కింద అభివృద్ధి చేస్తున్న జూనియర్ కళాశాలల పరిశీలనలో భాగంగా బుధవారం కొత్తపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుతున్న పనులను ఆయన పరిశీలించారు. పనులు నత్తనడకన జరుగుతున్నాయని అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రతి మీటింగులోనూ చెబుతున్నాం.. ఇది ప్రభుత్వానికి ప్రతిష్టాత్మక కార్యక్రమం.. ఈ నెలాఖరుకు పనులన్నీ పూర్తికావాలి అని సూచించారు. పాడైన కిటికీ తలుపులన్నీ తొలగించి కొత్తవి ఏర్పాటు చేయాలని అధికారులు, కమిటీకి సూచించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో నాడు–నేడు కింద రూ.7.29 కోట్లతో 10 జూనియర్ కళాశాలల అభివృద్ధి చేస్తున్నట్టు తెలిపారు. ఆయన వెంట సమగ్ర శిక్ష డీఈఈ జె.రాంజీ ఉన్నారు.

కచ్చితత్వంతో ఓటర్ల జాబితా



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్వో సత్తిబాబు

అమలాపురం రూరల్: ఓటర్ల జాబితా కచ్చితత్వంతో రూపొందించేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు సలహాలు సూచనలు ఇవ్వాలని జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్ సత్తిబాబు కోరారు. బుధవారం కలెక్టరేట్‌లోని డీఆర్‌ఓ చాంబర్‌లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ప్రత్యేక ఓటరు జాబితా సంక్షిప్త సవరణ– 2024, పురోగతిపై సమీక్షించారు. ప్రత్యేక సంక్షిప్త సవరణ 2024 ప్రక్రియ కింద చేపట్టిన ఓటర్ల నమోదు, జాబితాల సవరణ అంశాలపై చర్చించారు. జిల్లాలో సవరణ ప్రక్రియలో ఇప్పటి వరకూ అందిన ఫారం–6,7,8 దరఖాస్తుల పరిష్కారాన్ని వేగవంతం చేశామన్నారు. జనాభా పెరుగుదల రేటు, స్త్రీ, పురుష నిష్పత్తి ఆధారిత అంచనా ప్రాతిపదికన జాబితాను రూపకల్పన చేస్తున్నట్లు తెలిపారు. ఓటర్లుగా నమోదు చేసేందుకు అన్ని కళాశాలల్లో ప్రత్యేక డ్రైవ్ చేపడుతున్నామన్నారు. అభ్యంతరాలను స్వీకరించి దరఖాస్తులపై డిసెంబర్ 26వ తేదీ నాటికి పరిష్కారం పూర్తి చేస్తామన్నారు. జిల్లావ్యాప్తంగా 1,644 పోలింగ్ కేంద్రాల పరిధిలో డిసెంబర్ 2, 3 తేదీలలో స్పెషల్ క్యాంపెయిన్ చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు సంసాని బులి నాని, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కామన ప్రభాకర్‌రావు, బడుగు సత్యనారాయణ, దూరి రాజేష్, చంద్రరావు పాల్గొన్నారు.

సామాజిక సాధికార జాతర

- వైఎస్సార్ సీపీ పాలనను వివరించేందుకు బస్సులో వస్తున్న నాయకులు
- నాలుగున్నరేళ్లలో అన్ని వర్గాలకు సముచిత లబ్ధి
- ఇప్పటికే గడప గడపకూ మన ప్రభుత్వం పేరుతో జనంతో మమేకం
- జగనన్న సురక్ష పేరుతో ఉచితంగా ధ్రువీకరణ పత్రాలు
- తాజాగా 'జగనన్న ఆరోగ్య సురక్ష'తో జనం గుండె తలుపు తట్టిన సర్కారు
- నేడు రావులపాలెం నుంచి భారీ ర్యాలీ, కొత్తపేటలో భారీ బహిరంగ సభ



కొత్తపేటలో బస్‌యాత్ర ఏర్పాట్లు పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి



సామాజిక సాధికార యాత్ర బస్

కొత్తపేట: గత నాలుగున్నరేళ్లలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి పథకాలు, అన్ని వర్గాలకు చేసిన సామాజిక సమన్యాయం గురించి ప్రజలకు వివరించేందుకు గురువారం మధ్యాహ్నం కొత్తపేట నియోజకవర్గంలో సామాజిక సాధికారత బస్సు యాత్ర జరగబోతోంది. ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి ఆధ్వర్యంలో కోనసీమ ముఖద్వారం రావులపాలెంలో యాత్ర ప్రారంభమై నియోజకవర్గ కేంద్రం కొత్తపేట చేరుకుంటుంది. అక్కడ భారీ బహిరంగ సభ జరగనుంది.

పాల్గొననున్న ప్రముఖులు

కొత్తపేటలో జరిగే బహిరంగ సభలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి జోగి రమేష్, మంత్రులు పినిపే విశ్వరూప్, చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, కారుమూరి వెంకటనాగేశ్వరరావు, ఎంపీలు మిథున్‌రెడ్డి, పిల్లి సుభాష్‌చంద్రబోస్, చింతా అనూరాధ, జిల్లా పార్టీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే పొన్నాడ సతీష్, జిల్లా, ఎమ్మెల్సీలు తోట త్రిమూర్తులు, పండుల రవీంద్రబాబు, బొమ్మి ఇజ్రాయిల్, ఎమ్మెల్యేలు కొండేటి చిట్టిబాబు, జక్కంపూడి రాజా, రుడా చైర్మన్ మేడపాటి షర్మిలారెడ్డి, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, సామాజిక వర్గాల నాయకులు పాల్గొంటారు.

అన్ని వర్గాలకూ లబ్ధి

గతంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీలను ఓటు బ్యాంకుగా మాత్రమే ఉపయోగించుకుని వదిలేసిన ప్రభుత్వాలు ఉన్నాయి. కానీ వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక ప్రజా సంక్షేమ పథకాలతో పాటు రాజకీయ పదవులు, నామినేటెడ్ పదవులూ సామాజిక వర్గాల వారీగా దక్కాయి. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఈబీసీ వర్గాలకు పెద్ద పీట వేశారు. కులం, మతం, వర్గం, పార్టీ అనే తేడా లేకుండా సంక్షేమ పథకాలు అమలు చేశారు. ఈ విధంగా కొత్తపేట నియోజకవర్గంలో ఆయా వర్గాలకు సుమారు 2,109.17 కోట్ల మేర లబ్ధి చేకూరింది.

ఏడాదిగా జనంతో మమేకం

గతంలో ఎన్నికల్లో గెలిచిన ఎమ్మెల్యే గ్రామాలకు ఎప్పుడో గాని వచ్చేవారు కాదు. కానీ ఈ ప్రభుత్వంలో ఎమ్మెల్యేలు అలా కాదు. తరచూ గ్రామాలకు వస్తున్నారు. దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా గ్రామాలకే కాదు. ప్రతీ గడపకు వచ్చి ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధిని వివరిస్తూ ఇంకా ఏమైనా సమస్యలుంటే పరిష్కరించే కార్యక్రమం ఈ రాష్ట్ర ప్రభుత్వం మాత్రమే చేపట్టింది. ఏడాదిగా ఎమ్మెల్యేలు గడప గడపకూ మన ప్రభుత్వం పేరుతో జనంతో మమేకమై ఉన్నారు. సమస్యలేమైనా ఉంటే చెప్పండి! అంటూ అడుగుతున్నారు. ఎక్కడెక్కడో ఒకటి, రెండు కుటుంబాల సమస్యలను సాధ్యమైనవి అక్కడికక్కడే పరిష్కరిస్తున్నారు. తక్షణం సాధ్యం కాని వాటిని సాధ్యమైనంత త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇస్తూ అధికారులను ఆదేశిస్తున్నారు.

ఆరోగ్య సురక్షతో ప్రజల చెంతకే వైద్యం

ఈ ప్రభుత్వం వినూత్నంగా 'జగనన్న ఆరోగ్య సురక్ష' పేరుతో ప్రజల గుండె తలుపు తట్టింది. రోగులు ఆస్పత్రులకు రావడం పాత మాట, రోగుల వద్దకే వైద్యులు వెళ్లి ఉచిత సేవలు అందించిన ఘనత ఈ సర్కారుకే దక్కింది. వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి పరీక్షలు నిర్వహించారు. ఆ తర్వాత సాధారణ వైద్యులతో పాటు వివిధ విభాగాల వైద్య నిపుణులు ఆ గ్రామాలకు వెళ్లి ప్రజలకు వైద్య సేవలందించారు.

బస్‌యాత్రకు భారీ ఏర్పాట్లు

సామాజిక సాధికారత బస్సు యాత్రకు భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు. రావులపాలెం ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాల గ్రౌండ్ నుంచి బస్ యాత్రతో పాటు దానికి ముందు భారీ మోటార్ సైకిల్ ర్యాలీ సాగనుంది. కళాశాల వద్ద బస్‌కు క్రేన్‌తో భారీ గజమాల, కోనసీమ ముఖద్వారం వద్ద 500 కొబ్బరి బొండాలతో ఏర్పాటు చేసిన దండను రెండు క్రేన్‌ల సాయంతో వేయనున్నారు. రావులపాలెం హైస్కూల్ సెంటర్ నుంచి కొత్తపేట వరకూ ఐదు చోట్ల భారీ స్వాగత ద్వారాలు ఏర్పాటు చేస్తున్నారు. కొత్తపేటలో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నారు. సుమారు 15 వేల మందికి భోజనాలు ఏర్పాటు చేస్తున్నారు.

సీఎం ధైర్యాన్ని మెచ్చుకుంటున్న జనం

'మీ కుటుంబానికి ఈ ప్రభుత్వం వల్ల మేలు జరిగిందీ అంటే మళ్లీ మాకు ఓటెయ్యండి' ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెప్పిన మాట ఇది. మేలు జరిగి ఉంటే ఓటెయ్యండని అడిగిన ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి. ఆయన మాటలపై రాష్ట్రవ్యాప్తంగా బాగా చర్చ జరుగుతోంది. ఇలా అడగటానికి ఎంతో దమ్ము, ధైర్యం ఉండాలి. జగనన్న నాయకత్వంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రతిపక్ష నేతగా పాదయాత్రలో ఇచ్చిన హామీలు, ఎన్నికల్లో విడుదల చేసిన మేనిఫెస్టోలో పేర్కొన్న సంక్షేమ పథకాలు తూచా తప్పకుండా అమలు చేసింది గనుకనే అలా అనగలిగారు అని జనం చెప్పుకుంటున్నారు. గత టీడీపీ ప్రభుత్వం ఇచ్చిన హామీలు, మేనిఫెస్టో గాలికొదిలేసి ప్రజలను మోసం చేసింది. కానీ ఈ సీఎం జగన్ మాత్రం చెప్పినవి చెప్పినట్టుగా నీతిగా, నిజాయితీగా, అవినీతి రహితంగా అన్ని పథకాలు అమలు చేశారు. అందుకే మళ్లీ ఓటు అడిగే హక్కు, అర్హత ఈ వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే ఉంది. యస్ ఆ పథకాల ద్వారా మన ప్రతీ కుటుంబంలో ఇద్దరికి పైగా ఆర్థిక లబ్ధి పొందాం. కాబట్టి నీతి, నిజాయితీకి కట్టుబడి మళ్లీ జగన్‌కే ఓటు వెయ్యాల్సిన బాధ్యత మనపై ఉంది. అని ఎక్కడికక్కడ జనవాక్కుగా వినిపిస్తోంది.

సాహసోపేత నిర్ణయం

> వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నాలుగున్నరేళ్ల పాలనలో జరిగిన సంక్షేమాభివృద్ధిని ప్రజలకు వివరించేందుకు చేపట్టిన సామాజిక సాధికారత బస్సు యాత్ర చారిత్రాత్మకమైనది. జగనన్న పాలనలోనే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఈబీసీ వర్గాలకు సామాజిక, ఆర్థిక న్యాయం జరుగుతోంది. రాజకీయంగా ఆయా వర్గాలకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తూ నామినేటెడ్ పదవులు కట్టబెట్టారు. వారిని ఏనాడూ ఓటు బ్యాంకుగా భావించలేదు. బడుగు, బలహీనవర్గాలకు గుర్తింపు తీసుకువచ్చేందుకు రాష్ట్ర చరిత్రలోనే తొలిసారిగా బీసీ కులగణనకు శ్రీకారం చుట్టారు. ఇది సాహసోపేతమైన నిర్ణయం.
> – చిర్ల జగ్గిరెడ్డి, ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్, కొత్తపేట

క్లుప్తంగా

జాతీయ స్థాయి చిత్రలేఖనం పోటీలకు మహి



ఎన్‌టీపీసీ సీజీఎం రాజేష్‌కుమార్ సిన్హా చేతుల మీదుగా నగదు బహుమతి అందుకుంటున్న మహి

పి.గన్నవరం: విద్యుత్, ఇంధన పొదుపుపై కేంద్ర ప్రభుత్వం విశాఖ ఎన్‌టీపీసీలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి చిత్ర లేఖనం పోటీల్లో పి.గన్నవరం మండలం కె.ఏనుగుపల్లికి చెందిన అడబాల మహి తృతీయ స్థానం సాధించింది. దీంతో ఆమెను జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. మహికి ఎన్‌టీపీసీ సీజీఎం రాజేష్‌కుమార్ సిన్హా మంగళవారం రూ.22 వేల నగదు బహుమతిని అందజేశారు. ఆమె జవహర్ నవోదయలో 10వ తరగతి చదువుతోంది. మహి గతంలో కూడా జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని బహుమతులు అందుకుంది. జాతీయ స్థాయి చిత్రలేఖనం పోటీల్లో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు రాష్ట్రపతి లేదా ప్రధాని చేతుల మీదుగా బహుమతులు అందజేస్తారు.

తేనెటీగల దాడిలో వ్యక్తి మృతి



మృతుడు వెంకటరమణ

ఏలేశ్వరం: మండలంలోని యర్రవరం గ్రామంలో తేనెటీగల దాడిలో వ్యక్తి మృతిచెందాడు. గ్రామానికి చెందిన కోన వెంకటరమణ(54) మంగళవారం బహిర్భూమికి వెళ్లాడు. ఇంతలో తేనెటీగలు దాడిచేశాయి. మృతుడు అపస్మారక స్థితికి చేరుకోగా కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ వెంకటరమణ బుధవారం మృతి చెందాడు.

బాలుడిపై కుక్క దాడి



గాయపడిన మోక్షిత్

అల్లవరం: సామంతకుర్రులో మారిశెట్టి మోక్షిత్ (4)పై కుక్క దాడి చేసి తీవ్రంగా గాయపరిచింది. ఇంటి వద్ద ఆడుకుంటున్న మోక్షిత్ చెవి, కన్ను భాగాల్లో కరిచింది. దీంతో బాలుడిని కుటుంబ సభ్యులు బెండమూర్లంక పీహెచ్‌కి తరలించగా ప్రాథమిక చికిత్స అందించి ఏరియా ఆస్పత్రికి రిఫర్ చేశారు. అనంతరం ఏరియా ఆస్పత్రి వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స నిమిత్తం కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు.

సంతోషమని పింఛన్

- అరకొర నుంచి.. ఆదుకునే స్థాయికి సామాజిక పెన్షన్లు
- పడిగాపుల నుంచి పండుటాకులకు ఉపశమనం
- ఠంచనుగా 1వ తేదీన ఇంటి వద్దనే అందజేత
- వచ్చే జనవరి నుంచి రూ.3 వేలకు చేరనున్న వైనం
- జిల్లాలో 2.45 లక్షల మంది లబ్ధిదారులు



పెన్షను ఇంటి వద్దకే వెళ్లి అందజేస్తున్న వలంటీరు



ఆస్పత్రికి వెళ్లి పెన్షను అందజేస్తున్న వలంటీరు

రాయవరం: నాలుగున్నరేళ్ల క్రితం ప్రస్తుత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంకల్ప యాత్రలో పెన్షన్ దారుల జీవితాలకు భరోసా కల్పిస్తానని హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీ మేరకు అధికారంలోకి రాగానే పెన్షన్ సొమ్మును దశలవారీగా పెంచుతూ వచ్చారు. వచ్చే ఏడాది జనవరి నుంచి సామాజిక పెన్షన్ సొమ్మును మరో రూ.250 పెంచనున్నారు. తద్వారా పెన్షన్ రూ.3వేలకు చేరనుంది. సామాజిక పెన్షన్ల పంపిణీలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకువచ్చారు. గత తెలుగుదేశం పాలనలో ఇచ్చే అరకొర పెన్షన్ కోసం పంచాయతీల వద్ద పడిగాపుల కాసేవారు. ఆ పరిస్థితిని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తొలగించింది. ఒకటో తేదీనే పండుటాకులకు ఇంటి వద్దనే పెన్షన్ సొమ్మును అందించే విధంగా చర్యలు తీసుకున్నారు. మీకు నేనున్నాను..అనే భరోసాను సీఎం జగన్ చేతల ద్వారా కల్పించారు.

క్రమంగా పెంచుతూ..

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్ర చేసే సమయానికి రూ.1,000 పెన్షన్ ఇచ్చేవారు. పాదయాత్ర సమయంలో జగన్‌మోహన్‌రెడ్డి పెన్షన్‌ను దశల వారీగా రూ.3వేలు చేస్తానని హామీ ఇచ్చారు. ఆయన ఇచ్చిన హామీతో అప్పటి టీడీపీ ప్రభుత్వం ఒకేసారి రూ.2వేలు చేసింది. ఇదిలా ఉంటే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే రూ.2వేల పెన్షన్‌ను 2020 జనవరి నుంచి రూ.2,250కు పెంచారు. అనంతరం 2021 జూన్ నుంచి రూ.2,500కు పెంచారు. ఈ ఏడాది జనవరి నుంచి రూ.2,750కు పెంచారు. దీనివలన జిల్లాలో 1.98 లక్షల మంది వృద్ధులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు, కల్లుగీత కార్మికులు, ట్రాన్స్‌జెండర్లకు లబ్ధి చేకూరింది. ఈ పెంపుదల కారణంగా జిల్లాలో ప్రతి నెలా అదనంగా రూ.4.97 కోట్ల భారం పడింది. అయినప్పటికీ ప్రభుత్వం పెన్షన్‌దారుల సంక్షేమానికే కట్టుబడి ఉంది. వచ్చే ఏడాది జనవరి నుంచి సంక్రాంతి కానుకగా రూ.3వేలకు పెంచనున్నట్లు ఇప్పటికే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించిన నేపథ్యంలో సామాజిక పెన్షన్‌దారుల మోముల్లో సంతోషం తొణికిసలాడుతోంది.

ఇంటి వద్దకే...

గత ప్రభుత్వ పాలనలో పెన్షన్లు తీసుకోవాలంటే చిన్నపాటి యుద్ధం చేయాల్సి వచ్చేది. పంచాయతీ కార్యాలయాల వద్ద పింఛన్ల కోసం పండుటాకులు పడిగాపులు పడేవారు. పింఛన్ సొమ్ము ఎప్పుడిస్తారో తెలియక, రోజంతా తిండీ తిప్పలు లేకుండా కళ్లు కాయలు కాసేలా ఎదురుచూసే పరిస్థితి ఉండేది. గంటలు, రోజులు తరబడి పడిగాపులతో వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు. పెన్షన్ తీసుకోవడం కోసం వారు పడే బాధలు వర్ణనాతీతంగా ఉండేవి. ఈ పరిస్థితుల నుంచి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం విముక్తి కలిగించింది. ఠంచనుగా పింఛన్ ఒకటో తేదీన వలంటీర్ల ద్వారా ఇంటికే అందించే ఏర్పాట్లు చేసింది. వేకువజాము నుంచే పించన్ల పంపిణీ ప్రారంభమవుతోంది. ఇలా పెన్షన్ కోసం వేచి చూసే పరిస్థితి నుంచి ఇంటి వద్దకే సొమ్ము అందించే స్థాయికి పెన్షన్ విధానాన్ని జగన్ సర్కారు తీర్చిదిద్దిన విధానాన్ని విప్లవాత్మకమైన చర్యగా భావించవచ్చు.

దరఖాస్తు చేసుకుంటే చాలు..

గతంలో నూతనంగా పెన్షన్‌కు దరఖాస్తు చేయాలంటే ప్రహసనంగా ఉండేది. కొత్త పెన్షన్ మంజూరు కావాలంటే ఆ గ్రామంలో లబ్ధిపొందుతున్న వారు మరణిస్తే ఆ స్థానంలో కొత్తవారికి పెన్షన్ వచ్చేది. ఈ పద్ధతికి స్వస్తి పలికి అర్హులు ఎవరు దరఖాస్తు చేసుకున్నా వారికి పెన్షన్ అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. దరఖాస్తు చేసుకున్న వెంటనే మిగిలిన ప్రక్రియలు పూర్తి చేసి త్వరితగతిన అర్హుల జాబితాలో చేర్చేందుకు చర్యలు తీసుకుంటోంది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో ఈ ఏడాది జనవరి నుంచి కొత్తగా 8,298 మందికి పింఛన్లు ప్రభుత్వం మంజూరు చేసింది. వీరి కోసం ప్రతి నెలా అదనంగా రూ.2.28 కోట్లు వెచ్చిస్తోంది.

పరిస్థితి ఇదీ..

కోనసీమ జిల్లాలో ప్రతి నెలా వృద్ధాప్య, వితంతు, దివ్యాంగులు, అభయహస్తం, చేనేత, డీఎంహెచ్‌వో, డప్పు కళాకారులు, చర్మకారులు, డయాలసిస్ (ప్రైవేట్), డయాలసిస్ (ప్రభుత్వ), కళాకారులు, ట్రాన్స్‌జెండర్లకు పింఛన్లను ప్రభుత్వం అందజేస్తోంది. నవంబర్ నెలలో 2,45,213 మందికి రూ.66,42,25,750 ప్రభుత్వం మంజూరు చేసింది.

మా కష్టాలు తెలుసుకుని..



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మా కష్టాలు తెలుసుకుని పెన్షన్ పెంచుతున్నారు. ఈ ఏడాది ప్రారంభం నుంచి రూ.2,750 ఇస్తున్నారు. పెన్షన్‌పైనే ఆధారపడే కుటుంబాలకు సంతోషకరం. వచ్చే ఏడాది జనవరి నుంచి పెన్షన్ పెంచడం మాలాంటి వారికి ఎంతో మేలు చేకూరుస్తుంది.

– ఆంద్ర మల్లేశ్వరరావు, పెన్షన్‌దారుడు, రాయవరం

మాట నిలుపుకున్నారు



ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మాకు ఇచ్చిన మాట ప్రకారం పెన్షన్ పెంచి ఇస్తున్నారు. ఇప్పటికే మూడు సార్లు రూ.250 వంతున పెంచారు. వచ్చే ఏడాది కొత్త సంవత్సరం కానుకగా మరో రూ.250 పెంచుతానని చెప్పడం ఆనందంగా ఉంది. మా వృద్ధుల కష్టాలు తెలుసుకుని ఇంటి వద్దకే పెన్షన్ తెచ్చి ఇస్తున్నారు.

– ఆకుల అప్పాయమ్మ, వానపల్లిపాలెం, ఉప్పలగుప్తం మండలం

విదేశాలకు పూతరేకుల ఎగుమతులను ప్రోత్సహించాలి

- మంత్రి అమర్నాథ్‌రెడ్డికి ఎంఆర్‌ఆర్ పుడ్స్ అధినేత రామరాజు వినతి
- అవసరమైన సహకారం అందిస్తామని మంత్రి హామీ



ఢిల్లీలో పూతరేకుల స్టాల్‌ను సందర్శించిన మంత్రి అమర్నాథ్

ఆత్రేయపురం: ఇతర దేశాలకు నాణ్యమైన పూతరేకులు ఎగుమతి చేసేందుకు అవసరమైన చేయూత అందిస్తామని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ హామీ ఇచ్చారు. ఆత్రేయపురం పూతరేకుల కీర్తిని చాటి చెప్పేలా ఢిల్లీ ప్రగతి మైదానంలో ఎంఆర్‌ఆర్ ఫుడ్స్ అధినేత ముదునూరి రామరాజు, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కోఆర్డినేటర్ రాజీవ్‌వర్మ ఇండియా ఇంటర్నేషనల్ ట్రేడ్ ఫేర్ స్టాల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆత్రేయపురం పూతరేకుల స్టాల్‌ను మంత్రి అమర్నాథ్ సందర్శించారు. ఈ సందర్భంగా రామరాజు పలు అంశాలను మంత్రి దృష్టికి తీసుకు వెళ్లారు. ప్రపంచ దేశాల్లో పూతరేకులకు మంచి డిమాండ్ ఉందన్నారు. దేశ కీర్తిని, రాష్ట్ర ప్రతిష్టను పెంచేలా ఆత్రేయపురం పూతరేకులు ప్రధాన ప్రాత పోషిస్తున్నాయని అందుకు రాష్ట్ర ప్రభుత్వం కూడా తమకు సహకారం అందించాలని కోరారు. అవసరమైన మెషినరీ, ఇతర సదుపాయాలు అందించాలని, తద్వారా ఎగుమతులు పెరిగే అవకాశం ఉందని మంత్రికి రామరాజు వివరించారు. దీనిపై స్పందించిన మంత్రి అమర్నాథ్ మాట్లాడుతూ ప్రభుత్వం తరపున సహాయ సహకారాలు అందజేస్తామని హామీ ఇచ్చారు. ఢిల్లీలో ఫుడ్‌స్టాల్ ద్వారా అంతర్జాతీయ మార్కెట్‌కు పూతరేకులను పరిచయం చేయడం హర్షణీయం అన్నారు. భౌగోళిక గుర్తింపు(జియోగ్రాఫికల్ ఐడెంటిటీ)తో ఆత్రేయపురం కీర్తి జాతీయ స్థాయికి చేరింది. దీంతో విశాఖపట్నం దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం ప్రాంగణంలో ఆత్రేయపురం పూతరేకులకు గ్లోబల్ ఇండికేషన్ ట్యాగ్ సర్టిఫికేషన్ ప్రదానం చేసిన విషయం విదితమే.

డ్వాక్రా మహిళకు బ్యాంకులో టోకరా

- రూ.28,600 సొమ్ము స్వాహా
- ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన వైనం



తుని బ్యాంకులో డ్వాక్రా మహిళను మోసగించిన అపరిచిత వ్యక్తి చిత్రం

తుని: బ్యాంకుకు డ్వాక్రా సొమ్మును కట్టడానికి వెళ్లిన మహిళను అపరిచిత వ్యక్తి మోసం చేసి రూ.28,600 స్వాహా చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితురాలు నూకరత్నం చెప్పిన వివరాలు ఇలా ఉన్నాయి. స్థానిక పార్కుసెంటర్ రోడ్డులో ఉన్న చైతన్య గోదావరి బ్యాంకుకు సెప్టెంబర్ 7వ తేదీన ఆమె వెళ్లింది. బ్యాంకుకు సొమ్ము చెల్లించేందుకు సేవింగ్ ఫారం పూర్తి చేయడం తెలియక పోవడంతో అక్కడే ఉన్న వ్యక్తిని ఆశ్రయించింది. ఆ అపరిచిత వ్యక్తి ఆమె నుంచి రూ.28,600 తీసుకుని ఒక ఫారంలో రూ.27,500, మరో ఫారంలో రూ.1,100 నమోదుచేసి బ్యాంకుకు చెల్లించినట్టు నటించి, వాటిపై బ్యాంకు సీల్ వేసి నూకరత్నంకు ఇచ్చాడు. ఆమె ఇంటికి వెళ్లి పోయింది. డ్వాక్రా రుణానికి సంబంధించి సొమ్ము చెల్లించడంతో గ్రూపు సభ్యులతో కలిసి బుధవారం బ్యాంకుకు వచ్చింది. బ్యాంకు సిబ్బందిని సంప్రదించి తమకు మళ్లీ రుణం ఇవ్వాలని అడిగారు. సదరు సిబ్బంది మీ గ్రూపునకు సంబంధించి రూ.28,600 కట్టాల్సి ఉందని చెప్పారు. దీంతో షాక్‌కు గురైన నూకరత్నం సెప్టెంబరు నె7వ తేదీన మొత్తం సోమ్మును చెల్లించామని రశీదు చూపించింది. ఖాతా తనిఖీ చేయగా అందులో సొమ్ము చెల్లించినట్టు లేదు. దీంతో బ్యాంకు సిబ్బందిని ప్రశ్నించగా తమకు సంబంధం లేదని, ఎంతో మంది రోజూ బ్యాంకు వస్తారని చెప్పారు. సొమ్ము చెల్లించిన తేదీని చెప్పడంతో బ్యాంకులో ఉన్న సీసీ ఫుటేజ్‌ను పరిశీలించగా నూకరత్నం నుంచి సొమ్ము తీసుకున్న వ్యక్తిని గుర్తించారు. తమకు న్యాయం చేయాలని బ్యాంకు అధికారికి, పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు ఆమె తెలిపారు.

మార్కెట్‌లోకి కియా ఈవీ 6 కారు



కారును విడుదల చేసిన కంటిపూడి సర్వారాయుడు

రాజమహేంద్రవరం సిటీ: నగరంలోని కంటిపూడి కియా షోరూంలో బుధవారం కియా ఈవీ6 కారును మార్కెట్‌లోకి విడుదల చేశారు. ఈ సందర్భంగా కంటిపూడి గ్రూప్ చైర్మన్ కంటిపూడి సర్వారాయుడు మాట్లాడుతూ ఫుల్ డ్యూయల్ మోటార్ సిస్టమ్‌తో సరికొత్త కియా ఈవీ6 కారు రూపొందించారన్నారు. కేవలం 5.2 సెకన్లలో 100 కేఎంపీహెచ్ వేగాన్ని చేరుకుంటుందని, ఆల్ట్రా ఫాస్ట్ చార్జింగ్ ద్వారా కేవలం 18 నిమిషాలలో 10 శాతం నుంచి 80 శాతం చార్జింగ్ చేసుకోవచ్చునన్నారు. ఒక్క ఫుల్ చార్జ్‌తో 708 కిలోమీటర్ల దూరం ప్రయాణించవచ్చన్నారు. ఇంటెలిజెంట్ సేఫ్టీ లెవెల్ 2, 8 ఎయిర్ బ్యాగ్స్ తదితర అత్యాధునిక సేఫ్టీ ఫీచర్లు ఈ కారులో పొందుపరిచారన్నారు. కార్యక్రమంలో కంటిపూడి గ్రూప్ డైరెక్టర్ కె.వినయ్‌బాబు, ఎం.జగన్, సీహెచ్ సత్యనారాయణమూర్తి (చిన్నబాబు), కె.మన్మోహన్‌రామ్, ఎస్‌బీఐ ఆర్ఎం టి.శ్రీనివాసరావు, బ్యాంక్ ఆఫ్ బరోడా డిప్యూటీ ఆర్ఎం వి.శ్రీనివాసరావు, జీఎం కామేష్ పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్తకు మూడు నెలల జైలు

పెదపూడి: ఒక మహిళ పట్ల అసభ్యంగా ప్రవర్తించిన టీడీపీ కార్యకర్తకు కోర్టు మూడు నెలల జైలు శిక్ష లేక రూ.10వేల జరిమానా విధించిన ఘటన ఇది. పెదపూడి ఎస్సై టి.రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం కైకవోలు గ్రామానికి చెందిన పెంకే సురేష్ 2019 సంవత్సరంలో అదే గ్రామానికి చెందిన ఆర్.దేవి పట్ల అసభ్యకరంగా ప్రవర్తించాడు. ఆమె అప్పటి ఎస్సై వి.సురేష్‌కు ఫిర్యాదు చేయగా ఆయన కేసు నమోదు చేశారు. ఈ కేసులో విచారణ అనంతరం నేరం రుజువు కావడంతో కాకినాడలోని పీజేసీఐ కమ్ జేఎఫ్‌సీఎం మేజిస్ట్రేట్ వి.ఎల్.ఎస్.సుందరి తీర్పునిస్తూ నిందితుడికి 3 నెలలు జైలు శిక్ష లేక రూ.10 వేల జరిమానా విధించినట్లు ఎస్సై తెలిపారు. ఏపీపీ కె.సుధారాణి కేసును వాదించారని ఎస్సై తెలిపారు.

మోటార్ సైకిల్ ఢీకొని బాలుడి మృతి

మృతికి కారణమైన మరో బాలుడిపై కేసు నమోదు



మృతి చెందిన మహేష్ శ్రీహర్ష (ఫైల్)

అమలాపురం టౌన్: అమలాపురం మండలం పేరూరు శివారు తలుపులమ్మ తోట వద్ద మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో అదే గ్రామానికి చెందిన దొంగ మహేష్ శ్రీహర్ష (11) మృతి చెందాడు. అదే గ్రామానికి చెందిన 16 ఏళ్ల బాలుడు వేరొకరి మోటారు సైకిల్‌ని తీసుకుని వేగంగా నడుపుతూ సైకిల్‌పై వస్తున్న మహేష్ శ్రీహర్షను ఢీకొట్టి అతని మరణానికి కారణమయ్యాడని అమలాపురం పట్టణ సీఐ టి.క్రాంతికుమార్ తెలిపారు. అమలాపురంలోని ప్రైవేటు స్కూలులో ఆరో తరగతి చదువుతున్న మహేష్ శ్రీహర్ష రోజూ సాయంత్రం గ్రామంలో ట్యూషన్‌కు సైకిల్‌పై వెళ్లి రాత్రికి ఇంటికి తిరిగి వస్తూ ఉంటాడు. మంగళవారం రాత్రి 7.45 గంటల సమయంలో ట్యూషన్ నుంచి తన సహచర విద్యార్థులు ఇద్దరితో కలిసి వేర్వేరుగా సైకిళ్లపై వస్తున్న సమయంలో ఈ ప్రమాదం జరిగింది. మహేష్ శ్రీహర్షను మోటారు సైకిల్ బలంగా ఢీకొట్టడంతో అతని తలకి తీవ్ర గాయమై మృతి చెందినట్లు సీఐ క్రాంతికుమార్ తెలిపారు. అదే గ్రామానికి చెందిన దొంగ సత్యరాము (చిన్నా) తన మోటారు సైకిల్‌ను డ్రైవింగ్ లైసెన్స్ పొందే అర్హత కూడా లేని 16 ఏళ్ల బాలుడికి ఇచ్చాడు. ప్రమాదానికి కారణమైన మైనర్ బాలుడిపైన, మోటారు సైకిల్ ఇచ్చిన దొంగ చిన్నాపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ క్రాంతికుమార్ తెలిపారు.

'తొమ్మిది బుధవారాలు - స్వామి వరాలు' బ్రోచర్ విడుదల



ఆధ్యాత్మిక బ్రోచర్ విడుదల చేస్తున్న ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని కృపకై కృష్ణ ధర్మరక్షణ, జై భగరంగ్ సంయుక్త ఆధ్వర్యంలో 9 బుధవారాలు–స్వామి వరాలు (9 బుధవారాలు దీక్ష–ప్రచారయాత్ర) ప్రచారంపై ప్రత్యేక ఆధ్యాత్మిక బ్రోచర్‌ను బుధవారం రామేశ్వరంలో ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు విడుదల చేశారు. ఈ మేరకు ఇందుకు సంబంధించి స్వామివారి వరాలు పేరిట ప్రచార గీతాన్ని శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్ రచించారు. దీనికి సింధూ కె.ప్రసాద్ సంగీతాన్ని స్వరపరిచారు. దీనిని ఈ నెల 20న అంతర్వేది ఆలయంలో విడుదల చేయనున్నట్టు డాక్టర్ ప్రతాప్, ప్రసాద్ తెలిపారు. నెడ్‌క్యాప్ డైరెక్టర్ పాటి శివకుమార్, సర్పంచ్ కట్టా ఉమా మహేశ్వరరావు, నాయకులు కుసుమ రాకేష్, నల్లి ప్రేమానందం పాల్గొన్నారు.

బోటులో అగ్ని ప్రమాదం

మత్స్యకారులకు గాయాలు



ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కొత్తపాలెం మత్స్యకారులు

కాట్రేనికోన: నిజాంపట్నం రేవులో బోటులో ఆయిల్ వేస్తున్న సమయంలో జరిగిన అగ్ని ప్రమాదంలో కొత్తపాలెంకు చెందిన మత్స్యకారులు తీవ్ర గాయాలపాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. కాట్రేనికోన మండలం కొత్తపాలెంనకు చెందిన మత్స్యకారులు పెమ్మాడి కృష్ణ, బలసాడి వెంకటేష్ జీవనోపాధి కోసం కుటుంబంతో సహా నిజాంపట్నం వెళ్లారు. అక్కడ ఒప్పందం కుదుర్చుకుని బోటులపై సముద్రంలో చేపల వేటకు వెళుతున్నారు. వేటకు వెళ్లేందుకు బోటులో ఆయిల్ వేస్తున్న సమయంలో అగ్ని ప్రమాదం జరిగింది. సుమారు రూ.60 లక్షల విలువ చేసే బోటు దగ్ధమైందని, ప్రమాదంలో గాయపడిన మత్స్యకారులు నిజాంపట్నం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని బంధువులు తెలిపారు.

యువమోర్చా ఇన్‌చార్జిగా కొండ



నాగసుధా కొండ

అమలాపురం రూరల్: తూర్పుగోదావరి జిల్లా యువమోర్చా ఇన్‌చార్జ్‌గా అమలాపురానికి చెందిన యల్లమిల్లి నాగసుధా కొండను నియమించారు. భారతీయ జనతా యువ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు మిట్టా వంశీకృష్ణ రాష్ట్ర పదాధికారులకు ఈ బాధ్యత అప్పగించారు. రాష్ట్ర ఆర్‌టీఐ సెల్ కన్వీనర్‌గా ఉన్న యల్లమిల్లి నాగ సుధా కొండలరావును తూర్పు గోదావరి జిల్లాకి ఇన్‌చార్జిగా నియమించారు. నియామక పత్రాన్ని భారతీయ జనతా యువమోర్చ జాతీయ కార్యదర్శి వినీత్ త్యాగి బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిట్రా శివన్నారాయణ, జాతీయ యువమోర్చ కార్యవర్గ సభ్యుడు ఉప్పిలి వంశీ చేతుల మీదుగా కొండ అందుకున్నారు. పార్టీలో సీనియర్‌గా కొండ సేవలను గుర్తించి ఈ పదవిని ఇచ్చారు. గతంలో యువమోర్చ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా జనరల్ సెక్రటరీ, జోనల్ ఇన్‌చార్జి, రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా, కవితల పోటీ కో కన్వీనర్‌గా ఆయన పనిచేశారు.

చలపతిరావుకు బాప్‌రెడ్డి అవార్డు



రఘునందన్ చేతుల మీదుగా బాప్‌రెడ్డి అవార్డు అందుకుంటున్న చలపతిరావు

అంబాజీపేట: స్థానిక డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన పరిశోధన కేంద్రం అధిపతి, కీటక విభాగం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎన్‌బీవీ చలపతిరావు బాప్‌రెడ్డి అవార్డును అందుకున్నారు. ఈ మేరకు బుధవారం ఆయన ప్రకటన విడుదల చేశారు. హైదరాబాద్‌లో ప్లాంట్ ప్రొటెక్షన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (పీఆర్ఏఐ) నిర్వహించిన ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ ప్లాంట్ హెల్త్ మేనేజ్‌మెంట్ (ఐసీపీహెచ్ఎం) 2023 ఇన్నోవేషన్ అండ్ సస్టేనబిలిటి 50వ గోల్డెన్ జూబ్లీ అంతర్జాతీయ సదస్సు జరిగిందన్నారు. ఈ సదస్సులో సమగ్ర సస్యరక్షణ ద్వారా కీటక శాస్త్రంలో సమగ్రమైన ప్రయోగాలు చేసినందుకు, జీవ నియంత్రణ ప్రయోగాలను విజయవంతంగా అభివృద్ధి చేసినందుకు బాప్‌రెడ్డి అవార్డు లభించినట్లు చలపతిరావు తెలిపారు. నాలుగు రోజులు పాటు జరిగిన అంతర్జాతీయ సదస్సుకి వివిధ రంగాల్లో కృషి చేసిన దేశ, విదేశ శాస్త్రవేత్తలు హాజరయ్యారన్నారు. హైదరాబాద్ ఏపీసీ అండ్ సెక్రటరీ టు గవర్నమెంట్, అగ్రికల్చర్ అండ్ కోఆపరేషన్ డిపార్ట్‌మెంట్ పీజేటీఎస్ఏయు వైస్ చాన్సలర్ ఎం.రఘునందన్ చేతుల మీదుగా బాప్‌రెడ్డి అవార్డును అందుకున్నానన్నారు. చలపతిరావుకు అవార్డు రావడంపై పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు, బోధనేతర సిబ్బంది, కార్యాలయ సిబ్బంది అభినందనలు తెలిపారు.